## వేతనాలు రాక ఏఎన్‌ఎంల ఇబ్బందులు

సంగారెడ్డి, మార్చి14: ఎన్‌హెచ్‌ఎం పరిధిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి అన్నారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ దవాఖాన డీఎంహెచ్‌వో సూపరింటెండెంట్ శ్రీవాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానల్లో ఎన్‌హెచ్‌ఎం పరిధిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం మారి నా ఏఎన్‌ఎంల బతుకులు మారడం లేదన్నా రు. కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వేతనాలు రాక ఇబ్బందులకు గురవుతున్నారని, ఇండ్ల అద్దెలు, పిల్లల పాఠశాల ఫీజులు కట్టలేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేసి, ప్రతినెలా ఒకటో తేదీన వేతనా లు చెల్లించాలని యాదగిరి విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మెడికల్ యూనియన్ నాయకురాలు మాధవి, శ్యామల ఉన్నారు.

సూపరింటెండెంట్‌కు వినతినత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

## గర్భిణులకు సామూహిక సీమంతం

న్యాల్‌కల్, మార్చి 14: హద్నూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషన్ అభియాన్ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసిన సామూహిక సీమంతంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు జహీరాబాద్ సీడీపీవో సునీతాబాయి పాల్గొని గర్భిణులకు ఒడి నింపి పండ్లు, పూలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు, శిశువుల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.

గర్భిణులు మంచి పోషక విలువతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనితాకుమారి, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, ఇందిరా, షహీన్‌బేగం, మాణెమ్మ ఆయాలు పాల్గొన్నారు.

హద్నూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీవో సునీతాబాయి

## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సంగారెడ్డి, మార్చి 14: ప్రభుత్వం పద్మశాలీల కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రకటన చేయడంతో జిల్లా పద్మశాలీసంఘం నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గురువారం పట్టణంలోని జిల్లా సంఘం కార్యాలయంలో జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ హరిహర కిషన్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌తో పద్మశాలీల్లో పేదవారికి ఆర్థికపరమైన ఇబ్బందులు తొలిగిపోయే అవకాశం ఉంటుందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన మంత్రులకు పద్మశాలీ సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు విశ్వనాథం, మురళి, సహకార్యదర్శులు అశోక్, రమేశ్, శ్రీధర్, సంపత్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పద్మశాలీసంఘం నాయకులు

## ఉపాధిహామీ బకాయిలు చెల్లించాలి

కంది, మార్చి 14: ఉపాధిహామీ కూలీల బకాయిలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి ఎం. నర్సింహులు డిమాండ్ చేశారు. మండలపరిధిలో చేపడుతున్న ఉపాధిహామీ ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధిహామీలో అనేక మార్పులు చేస్తున్న కేంద్రప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం వచ్చిన ప్పటి నుంచి పనిప్రదేశాల్లో టెంట్లు, మంచి నీరు, పనిముట్లు, మెడికల్ కిట్లు కట్ చేసిందని విమర్శించారు. 200రోజుల పని దినాలు, రోజూ కూలీ రూ.800 ఇవ్వాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, సుజాత, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

## పరిశ్రమలకు రక్షణ కల్పిస్తాం: ఎస్పీ

పటాన్‌చెరు, మార్చ్ 14: పరిశ్రమలకు రక్షణ కల్పిస్తామని ఎస్పీ రూపేశ్ అన్నారు. గురువారం రుద్రారంలోని గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పరిశ్రమల వల్ల యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. పరిశ్రమల్లో నిరంతరం ఉత్పత్తి జరగాలంటే వాటికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇండస్ట్రీయల్ సెక్యూరిటీపై, మహిళా కార్మికుల భద్రతపై శ్రద్ధ పెడతామన్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణం స్పందించి నష్ట నివారణ చేద్దామన్నారు.

కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవ్ రావ్, జనరల్ మేనేజర్ ఇండస్ట్రీస్ ప్రశాంత్‌కుమార్, డిప్యూటీ చీఫ్ ఇండస్ట్రియల్ ప్రవీన్‌కుమార్, డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, బీడీఎల్ సీఐ రవీందర్‌రెడ్డి, పటాన్‌చెరు సీఐ ప్రవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

## పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించాలి

సంగారెడ్డి, మార్చి14: జిల్లాలోని పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని, ప్రమాదాలకు కారణమవుతున్న యాజమాన్యాలను శిక్షించి బాధిత కుటుంబాలను అదుకోవాలని సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం పట్టణంలోని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు బీరం మల్లేశం మాట్లాడుతూ పరిశ్రమల్లో చోటుచేసుకుంటున్న ప్రమాదాలపై యాజమాన్యాలు స్పందించకపోవడంతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. అధికారులు పరిశ్రమ ల్లో తనిఖీలు చేస్తే అసలు విషయాలు బయ ట పడుతాయన్నారు. పరిశ్రమల యాజమాన్యాలకు తొత్తులుగా వ్యవహరించడంతో ప్ర మాదాలు జరుగుతున్నాయన్నారు. అందుకు బాధ్యులైన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారిని సస్పెండ్ చేసి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. నిరసనలో జయరాజు, రాజయ్య, పాండురంగారెడ్డి, నాగేశ్వర్‌రావు, కృష్ణ పాల్గొన్నారు.

# బడంపేటలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

కోహీర్, మార్చి14: బడంపేట రాచన్న స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 5 గంటలకు గర్భగుడిలోని శివలింగానికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం గంగపూజ, గోమాతకు పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వస్తి పుణ్యాహ వచనం, అంకురార్పణ, నాందిసమారాధన, అఖండ దీపారాధన నిర్వహించారు. అనంతరం తంగడపల్లి ఆశ్రమ పీఠాధిపతి శివయోగి శివాచార్య మహాస్వామి చేతుల మీదుగా ధ్వజారోహణం, శిఖర పూజను నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి స్వామివారి దర్శనానికి భక్తులకు అనుమతినిచ్చారు. దీంతో పలు ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వీరభద్రావతారంలో కొలువుదీరిన రాచన్నస్వామితోపాటు సమీపంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో కూడా భక్తు లు ప్రత్యేక పూజలు చేశారు. 300 సంవత్సరాల క్రితం రాచన్నస్వామి తపస్సు చేసిన అయ్యగుహలో పూజలు చేశారు. బిలాల్‌పూర్ కళాకారుతో భజన కీర్తనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం అగ్ని ప్రవేశం చేయనున్నారు. ఉత్సవాల్లో ఈవో శివరుద్ర ప్ప, జగదీశ్వర్‌స్వామి, దయానంద్ పాటిల్, శివమూర్తి స్వామి, భుజంగం పాల్గొన్నారు.

ధ్వజారోహణంలో భాగంగా పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

### అక్రమ దుకాణాలు

సంగారెడ్డి, మార్చి 14: ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు అక్రమార్కులు వాలిపోతున్నారు. కాలనీ ఏదైనా కబ్జా చేయడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని హైదరాబాద్-అకోలా పాత ప్రధాన రహదారిలో గోకుల్ దవాఖాన పక్కనున్న 250గజాల ప్రభుత్వ స్థలాన్ని కాలనీవాసులు కబ్జా చేసేందుకు డబ్బాలు ఏర్పాటు చేసి అద్దెకు నడిపిస్తున్నారు. ఈ స్థలం ప్రస్తు త మార్కెట్ విలువ ప్రకారం దాదాపు రూ. 4కోట్లు పలుకుతందని అంచనా. ఈ విషయంపై స్థానిక మైనార్టీ యువకుడు ఇస్మాయిల్ ఈనెల 5న కలెక్టర్ వల్లూరు క్రాంతి, తాసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కాలనీకి చెందిన కొందరు అక్రమార్కులు ప్రభుత్వస్థలాన్ని కబ్జా చేసేందుకు ముందస్తుగా డబ్బాలు ఏర్పాటు చేసి అద్దెకిచ్చి సొమ్ము చేసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

### ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం, మార్చి 14: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల గ్రామంలో లక్ష్మీ అనంత పద్మనాభస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. 16వ వార్డు కౌన్సిలర్ సుచరితా కొమురయ్య, 17వ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ల రవీందర్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి వేడుకలను ప్రారంభించారు. మూడు రోజులపాటు గ్రామంలో బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా జరుగనున్నాయి. స్వామివారికి విశేష అభిషేకాలంకరణ, గోపూజ, వరుణపూజ, గణపతిపూజ, స్వస్తి పుణ్యాహ వచనం, నాందిస్థాపన, నవగ్రహ పూజ, బ్రహ్మాది మండల దేవతాపూజ, ముఖ్యదేవ తారాధన, స్థాపన పూజలు, యాగశాల ప్రవేశం, అగ్నిస్థాపనం, గణపతిహోమం, నవగ్రహ హోమం నిర్వహించారు.

### పరీక్ష ప్యాడ్లు అందజేత

కోహీర్, మార్చి14: మండలంలోని దిగ్వాల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వసంతరాజు గురువారం విద్యార్థులకు అండగా నిలిచాడు. పదో తరగతి వార్షిక పరీక్షలు రాయనున్న 133 మంది విద్యార్థులకు రూ.15వేలతో కొనుగోలు చేసిన పరీక్ష సామగ్రిని అందించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచాలని 44మందికి కుండీలతో ఉన్న మొక్కలను సరఫరా చేసి తోటి ఉపాధ్యాయులతో శభాష్ అనిపించుకొన్నాడు. కార్యక్రమంలో హెచ్‌ఎం జాకీర్‌హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

బొల్లారం, మార్చి 14: బొల్లారం మున్సిపాలిటీకి చెందిన శ్రీనివాస్‌రెడ్డి కాలు చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని తెలుసుకున్న టీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు మానవత్వంతో ముందుకొచ్చి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కష్టకాలంలో అండగా నిలిచి అదుకున్న ఫౌండేషన్ సభ్యులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి నరసింహారెడ్డి, సభ్యులు సమ్మయ్య పాల్గొన్నారు.

సాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

### డ్రైవర్లకు ఆయుష్మాన్ కార్డులు

బొల్లారం, మార్చి 14: మున్సిపాలిటీకి చెందిన సఫాయి కర్మచారి, డిసెల్టింగ్ డ్రైవర్లకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆయుష్మాన్ హెల్త్‌కార్డులు అందజేసినట్లు మున్సిపల్ కమిషనర్ మంగతాయారు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఐఐటీ హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా పీఎం సూరజ్ పథకాన్ని ప్రారంభించగా, గవర్నర్ మున్సిపాలిటీ డ్రైవర్లకు ఆయుష్మాన్ కార్డులను అందజేశారని తెలిపారు.

### ధ్యాన మందిరానికి విరాళం

బొల్లారం, మార్చి 14: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీసీకాలనీలో నూతనంగా నిర్మిస్తున్న మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ధ్యాన మందిరానికి పటాన్‌చెరు మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు గడీల శ్రీకాంత్‌గౌడ్ రూ.44 వేల విరాళాన్ని గురువారం ఆలయకమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు భరత్‌చారి, నరసింహాచారి పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి.. లేదంటే పోరాటం చేస్తాం

సంగారెడ్డి మార్చి 14(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. గురువారం సంగారెడ్డిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్న.. ప్రభుత్వం స్పందించకపోవటం దారుణమన్నారు. నిజామాబాద్‌లో ఆటోడ్రైవర్ స్వామి భార్యతో కలిసి ఆత్మహత్య చేసుకోవడం విషాధకరమన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆటో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు భరో సా ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఇదివరకే ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలకు రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఆటోకార్మికులకు రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ఆటోడ్రైవర్లను ఆదుకోవాలని లేదంటే వారి పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

బీఆర్ఎస్ జిల్లా నాయకులు కాసాల బుచ్చిరెడ్డి, నరహరిరెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం నిర్లక్ష్య వైఖరి కారణంగానే ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఆటోడ్రైవర్ల ఆత్మహత్య నిలువరించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు, గోవర్ధన్ నాయక్, మధుసూదన్‌రెడ్డి, జి.వి.శ్రీనివాస్, మజీద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

## రూ.13.49కోట్లతో బల్దియా బడ్జెట్

సదాశివపేట, మార్చి 14: సదాశివపేట మున్సిపల్ సాధారణ అంచనా బడ్జెట్ రూ. 13.49కోట్లను కౌన్సిల్ ఆమోదం తెలిపిందని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ అపర్ణశివరాజ్‌పాటిల్ అధ్యక్షతన బడ్జెట్ పై సమావేశం నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి అంచనా బడ్జెట్ రూ.13 కోట్ల 49లక్షల 61వేలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మున్సిపల్ ఆదాయం రూ. 1063.70లక్షలు ఉంటుందని, ప్రస్తుత సంవత్సరానికి ప్రారంభ నిల్వ రూ.285.91 లక్షలు ఉన్నదన్నారు. మిగులు బడ్జెట్ రూ. 287.24లక్షలు ఉందన్నారు. క్యాపిటల్ ఆదాయం రూ.5910 లక్షలు, డిపాజిట్లు, అప్పులు రూ. 30లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

అనంతరం పట్టణంలో తాగునీటి ఎద్దడికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్ అదనపు కలెక్టర్‌ను కోరారు. మిషన్ భగీరథ ద్వారా రెండ్రోజులకోసారి నీరు సరఫరా చేస్తున్నారని, తాగునీరు సరిపోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ శివరాజ్ పాటిల్, వైస్‌చైర్మన్ చింతా గోపాల్, కమిషనర్ ఉమ, కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, ఇంద్ర మోహన్ గౌడ్, ప్రకాశ్, ఆకుల శివకుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

## డివిజన్ అభివృద్ధే లక్ష్యం

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, మార్చి 14: ఆర్సీపురం డివిజన్ అభివృద్ధే లక్ష్యమని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అన్నారు. గురువారం శ్రీనివాస్‌నగర్ కాలనీలోని బాలవిహార్ పార్కులో రూ.75లక్షలతో సుందరీకరణ పనులు, 14వ బ్లాక్‌లో రూ. 50లక్షలతో సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్సీపురం ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలనే లక్ష్యంతో బాలవిహార్ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. డివిజన్‌లోని ప్రతికాలనీలో అంతర్గత డ్రైనేజీ పైప్‌లైన్లను పునరుద్ధరించి సీసీ రోడ్లు వేస్తున్నామని చెప్పారు. డివిజన్ అభివృద్ధే ఏకైక లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్పొరేటర్‌గా ఎన్నికైన నాటి నుంచి కోట్లాది రూపాయలతో డివిజన్‌ను అభివృద్ధి చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ ప్రభు, బీఆర్ఎస్ నాయకులు అంజయ్య, ఐలేశ్, నర్సింహారెడ్డి, నందారెడ్డి, మహేందర్‌రెడ్డి, ప్రకాశ్, ప్రీతీగౌడ్, మవీన్ గౌడ్, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## పీఆర్ఏఈపై చర్యలు తీసుకోవాలి

మునిపల్లి, మార్చి 14: మండల పీఆర్ఏఈపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని మునిపల్లి ఎంపీపీ శైలజాశివశంకర్, జడ్పీటీసీ మీనాక్షీ సాయికుమార్ కోరారు. గురువారం ఎంపీపీ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

మునిపల్లి ఎంపీ పీ, జడ్పీటీసీ, మండలంలోని బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీలు పీఆర్ఏఈపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసి సమావేశాన్ని బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ పీఆర్ఏఈ ప్రొటోకల్ పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. వివిధ పనులపై ఫోన్ చేసినా స్పందించకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలిపారు. పీఆర్ఏఈ కాంగ్రెస్ పార్టీ నాయకుడిల వ్యవహరించడం సరికాదన్నారు. ఆయనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే జాతీయ రాహదారిపై రాస్తారోకో చేస్తామన్నారు. ఈ విషయంపై పీఆర్ఏఈని వివరణ కోరగా గ్రామాల్లో జరుగుతున్న పనులకు నాకు సంబంధం లేదనడం విమర్శలకు దారితీస్తుంది. అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రత్యేక చొరవతో మునిపల్లి మండలంలో కోట్ల రూ పాయలతో చేసిన అభివృద్ధి పనులకు ఇప్పటివరకు ఎంబీలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాడని మండిపడ్డారు. కలెక్టర్ వెంటనే స్పందించి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి ఎంబీలు తయారు చేసి బిల్లులు అందజేసేలా కృషి చేయాలని కోరారు.

### కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి, మార్చి14: జిల్లా కేంద్రంలోని రోడ్డు, నాలా స్థలం కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు సిద్ధార్థనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గురువారం వినతిపత్రం అందజేశారు. సిద్ధార్థనగర్ 196/2 సర్వే నంబరులో ఉన్న రోడ్డు, నాలా స్థలాన్ని అక్రమించి నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని స్థలాన్ని కాపాడాలని ఫిర్యాదు చేశారు. రోడ్డు, నాలాలో కబ్జాలను తొలిగించి కాలనీవాసులకు వసతులు మెరుగుపర్చాలని కోరారు. కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లయ్య, సుదర్శన్, రాములుగౌడ్, సైమన్, నర్సింహులు, నర్సింహులు, ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు మహేంద్ర పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు సహకరించాలి

హత్నూర, మార్చి14: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని సంగారెడ్డి ఆర్డీవో వసంతకుమారి అన్నారు. గురువారం హత్నూర రైతువేదికలో రీజినల్ రింగురోడ్డులో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించి రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీజినల్ రింగురోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భూములు కోల్పోతున్న రైతులు అభిప్రాయాలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం పలు గ్రామాల రైతులు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వల్ల భూముల ధరలు అమాంతం పెరగడంతో ప్రభుత్వం చెల్లించే మార్కెట్ ధరతో తీవ్రంగా నష్టపోతామన్నారు. ప్రైవేటుగా పెరిగిన ధరలకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలని కొందరు, డబ్బులకు బదులు ఇతర ప్రాంతాల్లో భూములు కేటాయించాలని మరికొందరు తెలిపారు. ట్రిపుల్ ఆర్ వెంట సర్వీసు రోడ్డు ఇవ్వాలని, లేని పక్షంలో భూములు ఇవ్వబోమన్నారు. సర్వీసు రోడ్డు లేకుండా త్రిబులార్ నిర్మాణం చేపడితే సమీప గ్రామాల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని, ప్రభుత్వ అధికారులు పునరాలోచన చేసి సర్వీసు రోడ్డు వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాసాల, దేవులపల్లి, సికిందాపూర్, దౌల్తాబాద్ గ్రామాల రైతులతోపాటు తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, రిటైర్డ్ రెవెన్యూ అధికారులు గోపాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

### ప్రజాభిప్రాయ సేకరణలో ఆర్డీవో వసంతకుమారి

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వసంతకుమారి

### 16న సర్వసభ్య సమావేశం

న్యాల్‌కల్, మార్చి 14: న్యాల్‌కల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈనెల 16న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి మండల అభివృద్ధి అధికారి సురేశ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన సూచించారు.

### పల్లెప్రగతిపై దృష్టి సారించాలి

కోహీర్, మార్చి14: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పల్లెప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా అన్నారు. గురువారం మండలంలోని చింతల్‌ఘాట్, కవేలి గ్రామాల్లో పర్యటించి పల్లెప్రగతి పనులను పరిశీలించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని సూచించారు. అనంతరం కోహీర్‌లోని ఎంపీపీ కార్యాలయంలో పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. డీపీవో వెంట ఎంపీవో రఘు, కార్యదర్శులు పాల్గొన్నారు.

### గృహజ్యోతికి ప్రజల తిప్పలు

హత్నూర, మార్చి14: ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాపాలనలో ఆరు పథకాలకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే క్రమంలో దొర్లిన తప్పుల వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అమలు చేస్తుండగా ఆన్‌లైన్‌లో జరిగిన పొరపాటు వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అధికారులు తిరిగి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో హత్నూర ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజలు బారులు దీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### యువ రైతు మృతి

సిర్గాపూర్, మార్చి 14: పశువులకు మేత తెచ్చేందుకు వెళ్లిన యువరైతు కరెం